క్లుప్తంగా

అణగారిన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యం

ఆదిలాబాద్‌రూరల్: అణగారిన వర్గాలకు రాజ్యాధికారమే తమ లక్ష్యమని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో నిర్వహించిన ఆవిర్భావ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 5 శాతం జనాభా లేని రెడ్డి, రావు దొరల పరిపాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర ముదిరాజ్, రాసాల వినోద్ యాదవ్, అన్నెల లక్ష్మణ్, అగ్గిమల్ల గణేష్, సంద అశోక్, అల్లూరి భూమన్న, సంతోష్, హన్మాండ్లు యాదవ్, మనోజ్ పాల్గొన్నారు.

అటవీ భూములు సాగు చేస్తే చర్యలు

ఇచ్చోడ: అటవీ భూములు సాగు చేస్తే చర్యలు తప్పవని ఉట్నూర్ ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర అన్నారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడారు. సిరికొండ మండలంలోని వాయిపెట్, భీంపూర్, ఫకీర్‌నాయక్ తండాలో అటవీ భూముల్లో కొంత మంది సాగు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, సాగు చేయడం మానుకోవాలన్నారు. చెట్లు నాటే కార్యక్రమాన్ని అడ్డుకున్నా.. చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మోచి గల్లిలో గురువారం ఉదయం 9 గంటలకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు నాగోర్ గౌజే కిరణ్ తెలిపారు. కార్యక్రమానికి మాదపూర్ పట్వారిగూడ నివర్తి మహరాజ్ రానున్నట్లు పేర్కొన్నారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా జంగుబాబు

బజార్‌హత్నూర్: మండలంలోని వర్తమన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్లయ్యపల్లి గ్రామానికి చెందిన మెస్రం జంగుబాబు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో మెంబర్‌గా ఎంపికయ్యారు. బుధవారం కలెక్టర్ రాజర్షీ షా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నియామక పత్రం అందజేశారు.

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: పొట్టేల్ సినిమా దర్శకుడు సాహిత్ మోత్కూరిని పీఆర్టీయూ నాయకులు బుధవారం సన్మానించారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ సంఘ భవనంలో శాలువాతో సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్ మాట్లాడుతూ తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డు గ్రహిత సాహిత్ మోత్కూరి ఉమ్మడి జిల్లాకు చెందిన వారని తెలిపారు. ఆయనకు అవార్డు రావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహాస్వామి, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించాలి



భూమిపూజ చేస్తున్న హౌజింగ్ ఏఈ నసీర్

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని గృహ నిర్మాణశాఖ ఏఈ నజీర్ అహ్మద్ సూచించారు. ఆదిలాబాద్ పట్టణంలోని 45వ వార్డు భుక్తాపూర్‌కాలనీలో బుధవారం పలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. 5 విడతల్లో లబ్ధిదారులకు నిధులు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ బండారి సతీష్, వార్డ్ ఆఫీసర్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

సిరికొండ: ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తుకారం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రజావాణి నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. అధికారుల సమక్షంలోనే విచారణ చేపట్టారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఫణింధర్, ఎంపీడీవో రవీందర్ పాల్గొన్నారు.

మొరాయిస్తున్న తహసీల్దార్ సిటీజన్ సైట్

జైనథ్: భూ సమస్యల పరిష్కరం కోసం ప్రభుత్వం గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. అందులో వచ్చిన దరఖాస్తులను అధికారులు తహసీల్దార్ సిటీజన్ సైట్‌లో పొందుపరుస్తున్నారు. సైట్ మోరాయించడంతో ఇబ్బంది పడుతున్నారు. దానికి తోడు దరఖాస్తు చేసుకున్న అర్జీదారులకు ఫోన్ చేస్తున్న క్రమంలో కొంతమంది ఓటీపీ నంబర్లు చెప్పడం లేదని అంటున్నారు. ఆధార్ నంబర్లకు ఫోన్ లింకు లేక సమస్యలు వస్తున్నాయన్నారు. మొత్తం 573 దరఖాస్తులు వచ్చాయని, 12 మాత్రమే పూర్తి చేయగలమన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా విస్తారంగా కురిసిన వర్షం బుధవారం తెరిపినిచ్చింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనులను రైతులు ముమ్మరం చేశారు. పురుగుల మందుల పిచికారీ, కలుపుతీత, దౌర వంటి పనుల్లో బిజీబిజీగా మారారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



కలుపు తీస్తున్న కూలీలు



విత్తనాలు విత్తుతున్న కూలీలు



పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు

సకాలంలో అందని వేతనాలు

- ఎంపీడబ్ల్యూ, ఈ–పంచాయతీ ఆపరేటర్లకు తప్పని తిప్పలు
- అప్పు కూడా పుట్టడం లేదంటూ ఆందోళన



చెత్త సేకరిస్తున్న మల్టీపర్పస్ వర్కర్‌లు

ఆదిలాబాద్‌రూరల్: దేశం అభివృద్ధి చెందాలంటే గ్రామాలే పట్టుకొమ్మలు. అందులో భాగంగానే గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించకుండా ఉండేందుకు ఇంటింటికీ వెళ్లి ఏ రోజు చెత్తా ఆ రోజే సేకరించేందుకు గత ప్రభుత్వం 2019లో మల్టీపర్పస్ వర్కర్‌లను (ఎంపీడబ్ల్యూ) నియమించింది. వీరితో పాటు గ్రామ పంచాయతీలకు అన్నిరకాల పౌర సేవలు అందించేందుకు 2015లో ఈ– పంచాయతీ ఆపరేటర్లను నియమించింది. అయితే ఆయా గ్రామ పంచాయతీల జనాభాకు అనుగుణంగా మల్టీపర్పస్ వర్కర్‌లను నియమించగా గ్రామ పంచాయతీల సంఖ్యకు అనుగుణంగా ఈ– పంచాయతీ ఆపరేటర్‌లను నియమించారు. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాండ్స్ నుంచి వేతనాలు అందజేస్తారు.

సకాలంలో అందని వేతనాలు

ఆదిలాబాద్ రూరల్ మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా 99 మంది మల్టీ పర్పస్ వర్కలు ఉన్నారు. ఇద్దరు ఈ పంచాయతీ ఆపరేటర్‌లు ఉన్నారు. మావల మండలంలో మూడు గ్రామ పంచాయతీలు ఉండగా ఏడుగురు మల్టీ పర్పస్ వర్కర్‌లు, ఒకరూ ఈ–పంచాయతీ ఆపరేటర్ ఉన్నారు. వీరికి అసలే చాలీచాలనీ వేతనాలు అందజేస్తున్నారు. అవి కూడా సకాలంలో రాకుండా మూడు నెలల పాటు పెండింగ్‌లో ఉండడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

నిధులు రాగానే జమ చేస్తాం

మల్టీపర్పస్ వర్కర్స్, ఈ– పంచాయతీలకు సంబంధించి మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు లేకపోవడంతో కొంత వేతనాలు చెల్లింపులో జాప్యం జరుగుతుంది. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే వారి ఖాతాలో జమ చేస్తాం. మల్టీ పర్పస్ వర్కర్‌లు, ఈ– పంచాయతీ ఆపరేటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– స్వప్న శీల, ఎంపీవో, ఆదిలాబాద్ రూరల్

బహిరంగ సభ జయప్రదం చేయండి



ఇంద్రకరణ్ రెడ్డిని సన్మానిస్తున్న ఆడే గజేందర్

కైలాస్‌నగర్/నేరడిగొండ: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో చేపట్టనున్న గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల బహిరంగ సభను జయప్రదం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. మొదటిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ బుధవారం శాలువాతో సత్కరించారు. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, నగేశ్, నర్సింగ్, సుధాకర్ గౌడ్, శ్రీలేఖ, లత, సోనియా, ప్రభావతి, ఇందిర పాల్గొన్నారు.

ఉట్నూర్ సభకు తరలిరండి



మాట్లాడుతున్న మనోజ్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 49ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉట్నూర్‌లోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించే సభకు ఆదివాసీలు భారీగా తరలిరావాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ జీవోతో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 339కు పైగా గ్రామాల్లో ఆదివాసీలు భూమిహక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా జీవో అమలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు సలాం వరుణ్, కోడప సోనెరావు, కుంర రాజు, ఆత్రం గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

ఇంద్రవెల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు విత్తనాలు వేసి 20 రోజులు అవుతున్నా.. ఎరువులు దొరకని పరిస్థితి నెలకొందన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా పంపిణీ కార్యక్రమం అరకొరగా ఉండడంతో రైతులు సాగు చేసిన పంటలకు సమయానికి ఎరువులు వేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు దృష్టి సారించి రైతులకు ఎరువులు కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఆనంద్‌రావ్, బండు, రాము, జయబాయి, రంభబాయి, చిత్రు పాల్గొన్నారు.

రామారావు సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇచ్చోడ: మాజీ మంత్రి గోడం రామారావు సేవలు చిరస్మరణీయమని బీజేపీ బోథ్ అసెంబ్లీ కన్వీనర్ కదం బాబారావు అన్నారు. బుధవారం రామారావు జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన శాఖ మంత్రిగా, బోథ్ ఎమ్మెల్యేగా పని చేసిన ఆయన హయాంలో మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారానికి ఎంతోగానో కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ అమ్టే, నాయకులు సోన్‌కాంబ్లే కృష్ణకుమార్, నరాల శ్రీనివాస్, పెందుర్ తుల్సిరాం, అంబేకర్ పాండురంగ్, కాండ్లి రమణయ్య, తృప్తి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న అధికారులు

నేరడిగొండ: మండలంలోని బోరిగాం బ్రిడ్జి సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదంపై గతనెల 28న 'సాక్షి' దినపత్రికలో 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. బుధవారం విద్యుత్ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, తక్షణ చర్యలు తీసుకున్న విద్యుత్ లైన్‌మెన్ రాథోడ్ ఉల్లాస్, అసిస్టెంట్ లైన్‌మెన్ రణధీర్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు వెళ్లి బంద్ చేపట్టారు. తరగతులను బహిష్కరించారు. సంఘం జిల్లా కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులతో పాటు యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల చదువు పూర్తయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో యాజమాన్యాలు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు దీపలక్ష్మి, ఆశిష్, అఖిల్, మహేంద్ర, మారుతి పాల్గొన్నారు.

స్వర్ణకార వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

ఇచ్చోడ: చేతి వృత్తిదారులకు ప్రభుత్వం చేయూత అందించేందుకు స్వర్ణకారుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. రోజురోజుకూ కార్పొరేట్ జూవెలరీ షాప్‌లతో పోటీ పడలేక, బంగారం ధరలు నానాటానికి పేరుగుతున్నందున జీవనోపాధి కష్టంగా మారిందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి రంగురాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పరామర్శించారు. కార్యకర్త శరత్ సోదరుడు రాచర్ల ప్రశాంత్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆయన బుధవారం పట్టణంలోని ఇందిరానగర్‌లోని వారి నివాసానికి చేరుకొని శరత్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డుకు చెందిన క్యాతం కృష్ణవేణి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు సాయిరెడ్డితో పాటు ఆయన స్నేహితులు రక్తదానం చేశారు. బుధవారం రిమ్స్‌లోని బ్లడ్ బ్యాంక్‌లో 16 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో దేవేందర్, కార్తీక్, రాము, అమర్, వెంకటేశ్, అమూల్, పృథ్వి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందించాలి

బోథ్: చౌకధరల దుకాణాల్లో బియ్యంతో పాటు నూనె, చక్కెర, గోధుమ పిండి, జొన్నలు, పప్పు దినుసులు వంటి నిత్యావసర సరుకులు రాయితీపై అందించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బుధవారం బోథ్ తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్, గ్రంథాలయ మాజీ డైరెక్టర్ వెంకట రమణ గౌడ్, భీమ బుచ్చన్న, భీమ్రావు, బండారి యానప్ప, బీరం పోశెట్టి, కుమ్మరి భోజన్న పాల్గొన్నారు.

కాశీ విశ్వనాథుని సేవలో 'సోయం'



పూజలు చేస్తున్న సోయం బాపూరావు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపూరావు బుధవారం వారణాసిలోని కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్నారు. అక్కడి గంగనదిలో పుణ్యస్నానం ఆచరించిన ఆలయంలో రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి సత్కరించారు. కాగా జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ పూజలు చేసినట్లుగా ఆయన పేర్కొన్నారు.

వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని బొందిడి, సుర్దాపూర్ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. మొత్తం 86 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, హెల్త్ అసిస్టెంట్ జగదీశ్వర్ రెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన తుడుందెబ్బ నేతలు



కోర్టుకు వచ్చిన నాయకులు

బోథ్: ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలనే డిమాండ్‌తో గతంలో నిర్వహించిన రాస్తారోకో, ధర్నాలకు సంబంధించి నమోదైన కేసులపై బుధవారం తుడుందెబ్బ నేతలు బోథ్‌లోని జూనియర్ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తమపై పెట్టిన అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. ఎస్టీ హక్కుల పరిరక్షణ కోసం న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామన్నారు. కోర్టుకు హాజరైన వారిలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, కోడప నగేశ్, రామేల్లి భోజ్జన్న, మెస్రం భూమన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడాల స్వామి, కుర్మే రాజన్న ఉన్నారు.

రైతు భరోసా నిధులు ఇవ్వాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



బ్యాంక్ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న సమయంలో బ్యాంకర్లు రైతు పెట్టుబడి సాయం నిలిపివేయవద్దని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలోని బ్యాంక్‌లో రైతులకు వచ్చిన రైతు భరోసా నిధులు అప్పుల కింద కట్ చేస్తున్నారని తెలుసుకున్న ఆయన బ్యాంక్‌ను సందర్శించారు. బ్యాంక్ అధికారులతో మాట్లాడుతూ రైతు భరోసా, ఉపాధిహామీ వంటి నిధులను అప్పుల్లోకి మళ్లించడం సరికాదన్నారు. మార్గదర్శకాలు పాటించకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు దయాకర్, శ్రీకాంత్, అశోక్, సాయిగౌడ్, సాయి, ఆశన్న, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన ప్రహరీ కూల్చివేత



ప్రహరీని కూల్చివేస్తున్న బల్దియా అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని బల్దియా అధికారులు బుధవారం కూల్చివేశారు. కాలనీకి చెందిన హరికిషన్ అనే వ్యక్తి ఇటీవల నూతనంగా ఇల్లు నిర్మించుకున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఏడు ఫీట్లను ఆక్రమించి ప్రహరీ నిర్మించాడు. దీంతో రోడ్డు కుచించుకుపోయింది. దీనిపై కాలనీవాసులు ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ రాజు చర్యలకు ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అక్కడికి చేరుకొని జేసీబీ సాయంతో అక్రమంగా చేపట్టిన ప్రహరీ కూల్చివేశారు. టీపీవో సుమలత, టీపీఎస్ నవీన్ కుమార్ దగ్గరుండి కూల్చివేత పనులు పర్యవేక్షించారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న హర్టికల్చర్ అధికారి అలేఖ్య

సాత్నాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హర్టికల్చర్ అధికారి అలేఖ్య అన్నారు. బుధవారం మండలంలోని కాన్పా మేడిగూడ రైతువేదికలో ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎంఐడీహెచ్ పథకం కింద పండ్ల తోటలు, మామిడి, బొప్పాయి, దానిమ్మ, జామ, పూల సాగుకు 40 శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. తీగజాతి కూరగాయలైన కాకర, బీర, సోరకాయ, దొండ వంటి పంటల శాశ్వత పందిళ్ల నిర్మాణం కోసం 50 శాతం సబ్సిడీ కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆయిల్‌పాం పంటకు ఎప్పుడు గిరాకీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గణేష్, ఈపీసీ కంపెనీ ఆఫీసర్ పొచ్చన్న, రైతులు పోతన్న, రమేశ్, బాపురావు పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయాలి

నేరడిగొండ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గురువారం హైదరాబాద్‌లో జరగనున్న గ్రామస్థాయి కార్యకర్తల సమావేశానికి ప్రతిఒక్కరూ హాజరు కావాలని కోరారు. పార్టీ శ్రేయస్సు కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, వైస్ చైర్మన్ ఆడే వసంత్ రావు, గోక గణేష్ రెడ్డి, గొర్ల రాజు యాదవ్, తిత్రే నారాయణ సింగ్, పోతారెడ్డి పాల్గొన్నారు.